క్లుప్తంగా

రెడ్ల కార్తీక వనభోజనాలు రేపు



పోస్టర్లు విడుదల చేస్తున్న రెడ్డి సంఘం నాయకులు

చెన్నేకొత్తపల్లి: కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని ఈ నెల 27న కనుమ వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద కార్తీక వనభోజనాలు నిర్వహించనున్నట్లు రెడ్డి సంఘం నాయకులు తెలిపారు. శనివారం స్థానిక మండల కేంద్రంలో సంఘం నాయకులు కరపత్రాలు విడుదల చేశారు. నాయకులు మాట్లాడుతూ పార్టీలకతీతంగా నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి మండలంలోని రెడ్లు కుటుంబ సమేతంగా హాజరుకావాలన్నారు. గోవిందరెడ్డి, నర్సిరెడ్డి, నరసింహారెడ్డి, శ్రీనివాస రెడ్డి, హనుమంత రెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు

రామగిరి: ధర్మవరంలో ఆత్మీయట్రస్ట్ ఆధ్వర్యంలో ధర్మవరంలోని కాకతీయ విద్యానికేతన్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో ఆదివారం చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు ట్రస్ట్ చైర్మన్ శెట్టిపి జయచంద్రారెడ్డి శనివారం తెలిపారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల 8,9,10వ తరగతి విద్యార్థులు పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. వివరాలకు 9030944717 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.


ముగిసిన కార్గో మాసోత్సవాలు

కదిరి అర్బన్: స్థానిక ఆర్టీసీ డిపోలో నెలరోజులుగా నిర్వహిస్తున్న కార్గో మాసోత్సవాలు శనివారం ముగిశాయి. కదిరి డిపో కార్గో డోర్ డెలివరీస్‌లో టార్గెట్ రీచ్ అయినట్లు డీఎం మైనోద్దీన్ తెలిపారు. మొత్తం 1400 డెలివరీలు బుక్ చేసినట్లు పేర్కొన్నారు. ఆర్టీసీ సిబ్బందితో పాటు ప్రభుత్వ ఉపాధ్యాయురాలు క్రిష్ణవేణి సైతం 10 డోర్ డెలివరీలను బుక్ చేసి ఆర్టీసీ ప్రచారోత్సవాల్లో పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

తాడిమర్రి: పూలఓబయ్యపల్లి సమీపంలో జూదం ఆడుతుండగా ఎస్ఐ నాగస్వామి తన సిబ్బందితో వెళ్లి దాడిచేశారు. ఐదుగురిని అరెస్ట్ చేసి రూ.7,260 నగదు, ఐదు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

దాతలకు సత్కారం



దాతలను సత్కరిస్తున్న చైర్మన్ భాస్కర్‌రెడ్డి

నల్లచెరువు: శ్రీ పాలపాటి దిన్నె ఆంజనేయ స్వామి ఆలయంలో స్వామివారిని అలంకరించి అభిషేకాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు. ఆలయప్రాగణంలో స్నానశాలలు, పార్కింగ్ టైల్స్ ఏర్పాటు చేయించిన దాతలు అరుణకుమారి కుటుంబ సభ్యులను ఆలయ కమిటీ చైర్మన్ దేవరింటి భాస్కర్‌రెడ్డి సత్కరించి స్వామి వారి చిత్రపటాన్ని అందజేశారు.

సమన్వయంతో పని చేస్తే మండలాభివృద్ధి

ధర్మవరం రూరల్: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మండలాన్ని మరింత అభివృద్ధి చేయాలని ఎంపీడీఓ సౌజన్యకుమారి సూచించారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ రమాదేవి అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సహకారంతో గ్రామాల్లో మౌలిక వసతులను కల్పించినట్లు తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాల్లో స్థానిక ప్రజా ప్రతినిధులను భాగస్వాములను చేయాలన్నారు. ఉద్యానశాఖ అధికారిణి అమరేశ్వరి మాట్లాడుతూ పండ్లతోటల సాగుపై వివరించారు. వ్యవసాయాధికారి ముస్తఫా మాట్లాడుతూ ధర్మవరం మండలాన్ని మధ్యస్థ కరువు మండలంగా ప్రభుత్వం ప్రకటించిందని, ప్రభుత్వం అన్ని రకాలుగా రైతాంగాన్ని ఆదుకుంటుందన్నారు. ఏపీఓ అనీల్‌కుమార్‌రెడ్డి ఉపాధి పనులపై వివరించారు. మండల స్పెషలాఫీసర్ చాంద్‌బాషా పాల్గొన్నారు.

వెండి రథంలో శ్రీవారు



స్వామివారిని ఊరేగిస్తున్న దృశ్యం

కదిరి టౌన్: శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం తులసమ్మ(తులసీ బృందావనోత్సవం)పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఆస్థాన పూజలు, నివేదన కార్యక్రమం నిర్వహించి స్వామి వారి ఉత్సవమూర్తులను వెండిరథంలో ఉంచి ఆలయ ప్రాకారోత్సవం నిర్వహించారు. అనంతరం ఊంజల్‌సేవ నిర్వహించారు. ఈఓ వి.శ్రీనివాసరెడ్డి, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

పథకం అందని కుటుంబమే లేదు

- జగనన్న పాలనలో అర్హులందరికీ సంక్షేమ ఫలాలు
- ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గడిచిన నాలుగున్నరేళ్లలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించిందని పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అన్నారు. కొత్తచెరువులో శనివారం జరిగిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు జరిగిన లబ్ధిని వివరించారు. సమస్యలపై ఆరా తీశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వమూ ఇంత పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అందించిన దాఖలాలు లేవన్నారు. పాదయాత్రలో, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ జగనన్న నెరవేర్చారన్నారు. సంక్షేమ పథకాల ద్వారా ఒక్కో కుటుంబానికి రూ.లక్షల్లో లబ్ధి జరిగిందన్నారు. ఇంకా ఎవరైనా అర్హులు పథకాలకు నోచుకోకపోతే తన దృష్టికి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జగన్‌మోహన్‌రెడ్డి, సీనియర్ నాయకుడు తలమర్ల సొసైటీ మాజీ అధ్యక్షుడు రెడ్డెప్పరెడ్డి, జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు అంగడి సోమశేఖర్‌రెడ్డి, జిల్లా వక్ఫ్ బోర్డు ఉపాధ్యక్షుడు షాన్‌షేట్, నాగరాజు, ఎంపీటీసీలు రఫీ, సాంబశివారెడ్డి, రమణారెడ్డి, కృష్ణారెడ్డి, అతావూర్ రహిమాన్, డాక్టర్ హనుమంతరెడ్డి, అశోక్‌రెడ్డి, వైస్ సర్పంచ్ యుగంధర్, స్థానిక నేతలు ఎల్లప్ప, భాస్కర్, ప్రభావతమ్మ, అయూబ్ ఖాన్, డీలర్ శీన, అశోక్, పెయింటర్ కేశవ, సుబ్బారావు, సొసైటీ అధ్యక్షుడు రఘునాథరెడ్డి, పోతిరెడ్డి, తిప్పారెడ్డి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో జాప్యం వద్దు



అధికారులతో సమీక్షిస్తున్న కదిరి ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి

- అధికారులకు ఎమ్మెల్యే సిద్దారెడ్డి సూచన

కదిరి: ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం పనికిరాదని కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి అధికారులకు సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే మున్సిపల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో తన దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహించిన అధికారులను ఎమ్మెల్యే సున్నితంగా మందలించారు. తమకు ఇంటి స్థలం కేటాయించాలని పలువురు అర్హులైన పేదలు అర్జీలు ఇస్తే ఇప్పటి దాకా ఎందుకు పరిష్కరించలేదని సంబంధిత అధికారులపై ఎమ్మెల్యే మండిపడ్డారు. రోడ్డు పనులు పూర్తి చేసిన కొన్ని వార్డుల్లో బిల్లుల చెల్లింపునకు సంబంధించి పనుల నమోదుపై జరుగుతున్న జాప్యంపై ఎమ్మెల్యే సీరియస్ అయ్యారు. వార్డుల వారీగా 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో చేపట్టాల్సిన పనులన్నింటిపై ఎమ్మెల్యే సమీక్షించారు. అలసత్వం వహించే కొందరు అధికారులు, సిబ్బందిలో మార్పు రాకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ శ్రీహరిబాబు, కౌన్సిలర్లు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

కదిరి టౌన్: కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డిని అవమానించేలా సామాజిక మాధ్యమాల్లో పోస్టు పెట్టినట్లు ఇటీవల శ్రీనివాసులు అనే వ్యక్తి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోస్టు పెట్టిన తలుపుల మండలం కుర్రగుట్లపల్లికి చెందిన జి.పురుషోత్తం అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

27న సహస్ర దీపాలంకరణ

బత్తలపల్లి: కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని బత్తలపల్లిలోని లలితా త్రిపుర సుందరీ సమేతా ఓంకారేశ్వర ఆలయంలో సోమవారం వేయి దీపాలు వెలిగించి సహస్ర దీపాలంకరణ సేవ చేపట్టనున్నట్లు ఆలయ శాశ్వత ధర్మకర్త, ఏపీ కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబు, జెడ్పీటీసీ కోటి సుధ తెలిపారు. ఈ కార్యక్రమం సోమవారం సాయంత్రం 5గంటలకు ప్రారంభమవుతుందన్నారు.

పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి

బత్తలపల్లి: మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని ఎంపీడీఓ సాయిమనోహర్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక భారతి మండల సమాఖ్య కార్యాలయంలో లింగవివక్షకు వ్యతిరేకంగా జాతీయ స్థాయి జెండర్ ప్రచారంలో భాగంగా జెండర్ అధారిత హింసను అరికట్టడం, బాల్య వివాహాల నిర్మూలన, అనీమియా, బాలికా విద్యపై అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఏపీఎం సుదర్శన్‌రాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడారు. మహిళలు ఇంట్లోనే కొన్ని వ్యాపారాలు నిర్వహిస్తూ స్వశక్తితో జీవిస్తున్నారని, అలాంటి ముందడుగు వేసి పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. బాలికా విద్యను ప్రోత్సహించాలన్నారు. అంతకు ముందు శివాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. మండల సమాఖ్య లీడర్లు, సీసీలు సుధాకర్, వెంకటసత్యం, నాగానంద్, శంకర్, అకౌంటెంట్ గోవిందమ్మ, ఎస్‌హెచ్‌జీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత

ధర్మవరం అర్బన్: డాక్టర్ అంబేడ్కర్ దేశానికి అందించిన రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరునిపై ఉందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని శ్రీసాయి డిగ్రీ కళాశాలలో శనివారం జనవిజ్ఞాన వేదిక, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ సంయుక్తంగా రాజ్యాంగ దినోత్సవాన్ని ఏర్పాటు చేశారు. ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగ విలువలను తెలుసుకోవాలన్నారు. శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థల ఏర్పాటు, అధికారాలు, బాధ్యతలను రాజ్యాంగంలో పొందుపరిచారన్నారు. అనంతరం జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు మాట్లాడారు. అధ్యాపకులు గోపాల్‌నాయక్, ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ భార్గవి, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు నాగార్జున, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ధర్మవరంలో ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

బత్తలపల్లి: మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలుర గురుకుల పాఠశాలలో భారత రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. తహసీల్దార్ యుగేశ్వరిదేవి, ఎంపీడీఓ సాయి మనోహర్ హాజరై మాట్లాడారు. రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సత్యనారాయణ, పేరెంట్ కమిటీ చైర్మన్ కొడవండ్లపల్లి చంద్రశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

నగదు డిపాజిట్, విత్‌డ్రా యంత్రం ప్రారంభం

ప్రశాంతి నిలయం: సత్యసాయి మహాసమాధి దర్శనార్థం ప్రశాంతి నిలయానికి వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్‌రాజు అన్నారు. ప్రశాంతి నిలయానికి సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల సౌకర్యం కోసం కెనరా బ్యాంక్ ప్రశాంతి నిలయంలో ఏర్పాటు చేసిన క్యాష్ డిపాజిట్, విత్‌డ్రా మిషన్‌ను శనివారం ఆయన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం ప్రశాంతి నిలయం ఉత్తర ద్వారా సమీపంలో ప్రశాంతి నిలయం సెక్యూరిటీ వింగ్ కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన యంత్రాన్ని ప్రారంభించారు. ఎల్‌డీఎం రమణకుమార్, కెనరా బ్యాంక్ పుట్టపర్తి శాఖ మేనేజర్ కిరణ్ కుమార్, సిబ్బంది నరసింహులు పాల్గొన్నారు.



యంత్రాన్ని ప్రారంభిస్తున్న ఆర్‌జె.రత్నాకర్‌రాజు

ఆడపిల్లలపై వివక్ష చూపొద్దు

- న్యాయమూర్తి ప్రతిమ



మాట్లాడుతున్న న్యాయమూర్తి ప్రతిమ

గాండ్లపెంట: సమాజంలో ఎంతో మార్పు వస్తున్నా ఇంకా కొన్ని చోట్ల ఆడపిల్లల పట్ల తల్లిదండ్రులు వివక్షత చూపుతున్నారని, అలాంటి దుష్ట సాంప్రదాయాన్ని విడనాడాలని న్యాయమూర్తి ప్రతిమ సూచించారు. మండల పరిధిలోని సామాలగొంది పంచాయతీ బయ్యారెడ్డిపల్లి గ్రామంలో శనివారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని వరకట్న దురాచారం, వివక్షత, బాల్యవివాహాలు తదితర అంశాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఆడ, మగ వివక్షత లేకుండా పిల్లలను బాగా చదివించాలన్నారు. చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. న్యాయవాది కదిరి నరసింహులు, ఐసీడీఎస్ సీడీపీఓ గంగరత్నమ్మ, రెడ్స్ సంస్థ అధ్యక్షురాలు భానూజా, సర్పంచ్ శివప్పనాయుడు, మండల ఆర్బీకే చైర్మన్ శంకర్ నాయుడు, హెచ్‌సీ రామయ్య, హెచ్ఎం రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జాబితాపై అభ్యంతరాలు ఉంటే తెలపండి



మాట్లాడుతున్న ఆర్డీఓ భాగ్యరేఖ

పుట్టపర్తి అర్బన్: ఓటరు జాబితాపై అభ్యంతరాలు ఉన్నట్లయితే డిసెంబర్ 26 లోపు పూర్తి సమాచారంతో సంబంధిత అధికారులకు తెలియజేయాలని పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ పేర్కొన్నారు. శనివారం ఆమె తన కార్యాలయంలో అఖిల పక్ష నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ ఇప్పటి వరకూ వచ్చిన అభ్యంతరాలు, క్లెయిమ్‌లను పరిష్కరించామన్నారు. ఇంకా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలన్నారు. వచ్చే ఏడాది జనవరి 1 నాటికి 18 సంవత్సరాల వయసు నిండిన వారిని నూతన ఓటరుగా చేరవచ్చన్నారు. ఓటర్ల తొలగింపు, మార్పులు, చేర్పులు, ఒకే కుటుంబంలో 10మంది ఓటర్ల కంటే అధికంగా ఉన్నా వాటిని పరిశీలించడానికి అన్ని రాజకీయ పార్టీల నాయకులు తమ ప్రతినిధులను పంపి పరిశీలన చేయించాలన్నారు. తప్పులు లేని ఓటరు జాబితా తయారీకి బూత్ లెవెల్ అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్నారు. బుక్కపట్నం, నల్లమాడ తహసీల్దార్లు కరుణాకర్, దేవేంద్రనాయక్, పుట్టపర్తి మున్సిపల్ కమిషనర్ రాంభూపాల్ రెడ్డి, ఏఓ జిలాని, డీటీ నరసింహులు, రహిమాన్, వైఎస్సార్‌సీపీ నాయకులు రంగారెడ్డి, టీడీపీ నాయకులు విజయ్‌కుమార్, బీజేపీ నాయకులు విజయ్‌భాస్కర్‌రెడ్డి, సీపీఎం గంగాధర్, సీపీఐ వెంకటనారాయణ తదితరులు ఉన్నారు.

ముగిసిన శిక్షణ

నల్లమాడ: లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం (ఎల్ఐపీ)పై స్థానిక ఎస్టీ ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయులకు ఏర్పాటు చేసిన శిక్షణ శనివారం ముగిసింది. నల్లమాడ, పుట్టపర్తి మండలాల్లో విధులు నిర్వహించే జీవశాస్త్రం, భౌతిక శాస్త్రం ఉపాధ్యాయులు శిక్షణలో పాల్గొన్నారు. అధునాతన సాంకేతికతను ఉపయోగించుకొని పిల్లలకు ఏ విధంగా విద్యాబోధన చేయాలి, లెసన్ ప్లాన్ తయారీపై రీసోర్స్ పర్సన్‌లు జగదీష్, శ్రీధర్ శిక్షణ ఇచ్చారు.

మహిళలపై వివక్ష లేని సమాజమే ధ్యేయం





నల్లచెరువు: మాట్లాడుతున్న ఎంపీడీఓ శకుంతల, పెడపల్లిలో మానవహారం



కనగానపల్లిలో ప్రతిజ్ఞ చేస్తున్న వైకేపీ సిబ్బంది

పుట్టపర్తి అర్బన్: అంతర్జాతీయ స్త్రీ హింస నిర్మూలన దినాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. వైకేపీ సిబ్బంది, వైద్య ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది, మహిళా పోలీస్‌లు మహిళలతో కలిసి గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించి, మానవహారం ఏర్పాటు చేసి మహిళా వివక్షతపై అవగాహన కల్పించారు. డీఆర్‌డీఏ పీడీ నరసయ్య పుట్టపర్తి మండలం పెడపల్లిలో వైఎస్సార్ సర్కిల్‌లో మహిళలతో మానవహారం ఏర్పాటు చేయించి ప్రతిజ్ఞ చేయించారు. మహిళలపై లైంగిక వేధింపులకు అడ్డుకట్ట, బాల్య వివాహాల నిర్మూలన, మహిళల్లో రక్తహీనత, ఆడపిల్లలకు విద్య అనే అంశాలపై అన్ని మండలాల్లో ర్యాలీ నిర్వహించి మహిళలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఏపీఎంలు లక్ష్మీనారాయణ, లలిత, సీసీలు రాజశేఖర్, వెంకటరమణ, రామేశ్వరమ్మ, అన్ని శాఖల సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

బత్తలపల్లి: స్థానిక ఆర్‌కే ఫంక్షన్ హాల్‌లో 'అంతర్జాతీయ స్త్రీహింస నిర్మూలన దినం'నిర్వహించారు. సోషియల్ కమిటీ సభ్యులు గంగాధర్, రాధమ్మ, ఏఎన్ఎం రాధ, లతమ్మ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా ఎంపీడీఓ సాయిమనోహర్, ఎస్ఐ శ్రీనివాసులు హాజరై మాట్లాడారు. బాల్యవివాహాలు, నిరక్షరాస్యత, మద్యం, జూదం వంటి తదితర కారణాలు మహిళలపై హింసకు దారితీస్తున్నాయన్నారు. దిశ యాప్, తదితర చట్టాల గురించి వివరించారు. అంతకు ముందు ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు. ఏటీఎల్ రుక్మాంగద, గుమ్మళ్లకుంట నారాయణమ్మ, కౌన్సిలర్ శోభారాణి పాల్గొన్నారు.

నల్లమాడ: అంతర్జాతీయ మహిళా వివక్ష వ్యతిరేక దినం సందర్భంగా శనివారం నల్లమాడలో విద్యార్థినులతో ర్యాలీ నిర్వహించారు. ఆర్‌డీటీ ఆధ్వర్యంలో ఆర్‌డీటీ ఏరియా కార్యాలయం నుంచి వైఎస్సార్ కూడలి మీదుగా బస్టాండ్ వరకు ర్యాలీ జరిగింది. సంస్థ డైరెక్టర్ మోహన్ మురళీ మాట్లాడారు.

నల్లచెరువు: స్థానిక గీతామందిరంలో జరిగిన కార్యక్రమంలో ఆర్డీటీ రీజినల్ డైరెక్టర్ శాంతమ్మ, ఎంపీడీఓ శకుంతల, ఏటీఎల్ సుకన్య పాల్గొన్నారు. విద్యార్థులతో ర్యాలీ చేసి మానవహారం నిర్వహించారు. మహిళలు వేధింపులకు గురైతే పోలీసులకు లేదా 1098 నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.

గాండ్లపెంట: మండల కేంద్రంలోని ఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్ శనివారం ఆర్డీటీ ఆధ్వర్యంలో స్త్రీ హింస నిర్మూలన దినోత్సవాన్ని నిర్వహించారు. తొలుత ఆర్డీటీ కార్యాలయం నుంచి వైఎస్సార్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు. ఆర్డీటీ పర్సనల్ అధికారి ప్రసన్నకుమార్ ఎంపీడీఓ రామానాయక్, ఎస్ఐ వెంకటనారాయణ మాట్లాడారు.

కనగానపల్లి: మండల కేంద్రంలో స్త్రీ హింస నిర్మూలన దినోత్సవాన్ని నిర్వహించారు. స్థానిక మహిళా భవనం నుంచి బస్టాండ్ కూడలి వరకు డ్వాక్రా మహిళలు ర్యాలీ చేశారు. నాలుగురోడ్ల కూడలిలో మానవహారం ఏర్పాటు చేశారు. వైకేపీ ఏపీఎం హేమలత



నల్లమాడలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పాల్గొన్నారు. మామిళ్లపల్లిలో ఆర్డీటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్త్రీ హింసా నిర్మూలన దినాన్ని ఘనంగా నిర్వహించారు.

ధర్మవరం రూరల్: దుర్గా భవాని మండల సమాఖ్య ఆధ్వర్యంలో ధర్మవరం పట్టణంలో శనివారం జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా మహిళా సంఘం సభ్యులు భారీ ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీని పీడీ నరసయ్య ప్రారంభించారు.

ఎన్‌పీకుంట: మహిళా సాధికారతతోనే అభివృద్ధి సాధ్యమని వెలుగు సీసీలు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని తిమ్మమాంబ మండల సమాఖ్య ఆధ్వర్యంలో జెండర్ క్యాంపెయిన్ పై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు.

ముదిగుబ్బ: మహిళలపై జరుగుతున్న హింసను నివారించాలని ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ సుబ్బారావు అన్నారు. శనివారం ముదిగుబ్బ మండల కేంద్రంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. సీఐ యతీంద్ర, ఏపీఎం హేమలత, ఏటీఎల్ సంజీవరెడ్డి, ఎస్‌టీఎల్ సద్గుణ పాల్గొన్నారు.

ఖాద్రీశునికి కార్తీక శోభ



దీపాలు వెలిగిస్తున్నమహిళలు

కదిరి టౌన్: కార్తీక మాసాన్ని పురస్కరించుకొని శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. జిల్లాతోపాటు అనంతపురం, వైఎస్సార్, చిత్తూరు జిల్లాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి శ్రీఖాద్రీశుని దర్శించుకున్నారు. మహిళలు దీపాలు వెలిగించి మొక్కు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాల పంపిణీ చేశారు.

ఇంటి వద్దకే వైద్యసేవలు



రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ కల్పన

నల్లచెరువు: మండల పరిధిలోని ఉప్పార్లపల్లిలో ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ ప్రోగ్రాంను డాక్టర్ కల్పన ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. దివ్యాంగులకు, గర్భిణులు, బాలింతలకు వారి ఇంటి వద్దకే వెళ్లి బీపీ, షుగర్ పరీక్షలు చేశారు.

ఘనంగా కనకదాస జయంతి

రామగిరి: దుబ్బార్లపల్లిలో భక్త కనకదాస జయంతి వేడుకలను గ్రామస్తులు శనివారం నిర్వహించారు. ఉదయాన్నే మహిళలు బోనాలు మోసుకొని గ్రామ వీధుల గుండా వెళ్లి భక్త కనకదాస చిత్రపటం వద్ద సమర్పించారు. కురుబలు కనకదాస చిత్రపటాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి వేడుకలు జరిపారు.

లక్ష్మీనరసింహస్వామికి పూజలు



తాడిమర్రి: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఏకపాదంపల్లి గ్రామంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. మూలవిరాట్‌ను అలంకరించి పంచామృతాభిషేకం, కుంకుమార్చన పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కొబ్బరి కాయలు సమర్పించి మొక్కులు తీర్చు కున్నారు.

నిర్వాసితులకు న్యాయం చేస్తాం

తలుపుల: సిద్దుగూరిపల్లి గ్రామంలో ఎల్ఎఎస్ హెచ్ 717 రోడ్డు కోసం ఇంటి స్థలాలు కోల్పోయిన నిర్వాసితులతో తహసీల్దార్ కే.శ్రీధర్, ఎస్ఐ మగ్బూల్‌బాషా శనివారం సమావేశం నిర్వహించారు. నష్టపోయిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

ఐక్యతతోనే చేనేతల సమస్యల పరిష్కారం

- రౌండ్‌టేబుల్ సమావేశంలో నాయకులు



మాట్లాడుతున్న చేనేత జాతీయ నాయకులు

ధర్మవరం అర్బన్: చేనేతల ఐక్యతతోనే సమస్యలు పరిష్కారమవుతాయని ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు బండారు ఆనంద్‌ప్రసాద్, రాష్ట్ర అధ్యక్షుడు శివప్రసాద్, జాతీయ మహిళా నాయకురాలు జయశ్రీ అన్నారు. పట్టణంలోని సెమీనారాయణస్వామి ఆలయంలో అఖిల భారత చేనేత కుల సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో శనివారం 21 చేనేత కుల సంఘాల నేతలతో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేనేతలు రాజకీయంగా ఎదగాలని, సమస్యలపై పార్టీలకు అతీతంగా పోరాడాలన్నారు. చేనేత పరిశ్రమను నమ్ముకున్న కార్మికులను కాపాడుకోవాల్సిన బాధ్యత చేనేత కుల సంఘాలపైన ఉందని చెప్పారు. చేనేత సంక్షేమ మంత్రిత్వశాఖను చేనేత వర్గానికి చెందిన వారికి ఇవ్వాలని కోరారు. జాతీయ కమిటీ సభ్యులు పిల్లలమర్రి నాగేశ్వరరావు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కోడిపల్లి రాజా, మాజీ మంత్రి నిమ్మల కిష్టప్ప, ధర్మవరం పట్టుచీరల వ్యాపారస్తుల సంఘం అధ్యక్షుడు గిర్రాజు రవి, గౌరవాధ్యక్షుడు పోలా వెంకటనారాయణ, పోలా ప్రభాకర్, గిర్రాజు నగేష్, గడ్డం శ్రీనివాసులు, గిర్రాజు శశి, నాగరాజు, గడ్డం పార్థసారథి చంద్రశేఖర్, చిన్నశింగరయ్య, రంగన అశ్వర్థనారాయణ, రాము, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శేషయ్య, హస్తకళ కార్పొరేషన్ సభ్యులు బడిగింజల చంద్రమౌళి, రాష్ట్ర దేవాంగ అధ్యక్షుడు నాగరాజు, తొగటవీర క్షత్రీయ మహిళా అధ్యక్షురాలు శ్రీలత పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ సీఎంగా ఎన్నుకోవాలి



మాట్లాడుతున్న కొత్తకోట సోమశేఖర్‌రెడ్డి

నల్లమాడ: పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కు దక్కుతుందని వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు కొత్తకోట సోమశేఖర్‌రెడ్డి అన్నారు. కొండకిద తండా, వేళ్లమద్ది, యర్రవంకపల్లి, దొన్నికోట గ్రామ పంచాయతీల్లో శనివారం ఆయన తనయుడు కొత్తకోట చక్రధర్‌రెడ్డితో కలిసి 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర సంపూర్ణ అభివృద్ధికి జగన్‌ను రెండోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

'వికసిత్ భారత్'ను జయప్రదం చేయండి

పుట్టపర్తి అర్బన్: ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని పుట్టపర్తి ఎంపీడీఓ నాగేశ్వరరెడ్డి పేర్కొన్నారు. బొంతలపల్లి, చెర్లోపల్లి గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించి యాత్రపై అవగాహన కల్పించారు. సంక్షేమ పథకాలు పొందని అర్హులైన వారిని గుర్తించి వారి పేర్లను నమోదు చేసి వారికి కూడా సంక్షేమ పథకాలు అందించడం కోసం ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారన్నారు.